
# నవ్వుల పండుగ


మల్లాది వెంకట కృష్ణమూర్తి



వెంకట దీక్షితులు నవ్వు మరిచిపోయాడన్న వార్త నా చెవిన పడగానే ఆశ్చర్యపోయాను. నమ్మలేదు కూడా. నవ్వుని విపరీతంగా ప్రేమిస్తూ, అందరినీ నవ్వించే కార్టూన్లు వేసే దీక్షితులు నవ్వు మరిచిపోవడమా?

డామిట్! ఎక్కడో ఏదో పొరబాటుం దనిపించింది నాకు. ఆ వార్త తెలిసిన మర్నాడు, అంటే ఆదివారం దీక్షితు లింటికి వెళ్లాను. అపార్ట్‌మెంట్ తలుపు తెరిచే ఉంది. అతని భార్య దిగాలుగా కనిపించింది. ఒక్క అతని భార్యే కాదు, ఇంట్లోని యావన్మంది మొహాలూ దిగాలుగానే ఉన్నాయి.

"రండన్నయ్యగారూ!" దీక్షితులు భార్య నన్ను సాదరంగా ఆహ్వానించింది.



## సంబంధం!

"మాన్ ఆఫ్ ద మాచ్ అంటే ఎవరో తెలుసా?"

"తెలుసు."

"అయితే ఎవరు?"

"పెళ్లి కొడుకు!"

**- లకనం మూర్తి** (కాకినాడ)

లోపల గదిలో టి.వి. ముందు కూర్చుని, రేలంగిమీద స్పెషల్ ప్రోగ్రామ్ చూస్తూ, ఉస్సూరుమని నిట్టూరుస్తున్న దీక్షితులు నా కంటికి ప్రపంచంలోని ఎనిమిదో వింతలా కాక, మొదటి వింతలా కనిపించాడు. అతను నావంక చూసి, చిన్నగా నిట్టూర్చి, మళ్లీ టీవీవైపు సీరియస్‌గా చూడసాగాడు. పలకరింపుగా నవ్వే బదులు, పలకరింపుగా దీక్షితులు నిట్టూర్చడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

"నే విన్నది నిజమే నన్నమాట!" గొంతు తగ్గించి అడిగాను దీక్షితులు తల్లిని.

అవు నన్నట్లుగా తల ఊపి, ఆవిడ కళ్లు తుడుచుకుంది. దీక్షితుల్ని నవ్వించి కానీ బయటికి వెళ్లకూడదని నిశ్చయించుకున్నాను నేను. ఎదుటి మనిషిని నవ్వించే చక్కని సాధనమైన జోక్ ఉండనే ఉందిగా. గొంతు సర్దుకున్నాను. దీక్షితులు తండ్రి రిమోట్‌లోని మ్యూట్ బటన్‌ని నొక్కాడు.

"చూడు, దీక్షితులూ! ఓ పిల్లాడు తన తల్లి దగ్గరకి ఏడుస్తూ వెళ్లి కడుపు నొప్పిగా ఉందని చెప్పాడు. అందు కా తల్లి పొట్టలో ఏదైనా నింపితే కానీ ఆ నొప్పి తగ్గదని చెప్పి ఆ పిల్లాడికి కార్న్‌ఫ్లేక్స్ పెట్టింది. సాయంత్రం ఆ పిల్లాడి తండ్రి ఆఫీసు నుంచి తిరిగి రాగానే కుర్చీలో ఉసూరుమంటూ కూలబడి చెప్పాడు తనకి తల నొప్పిగా ఉందని. వెంటే ఈ పిల్లాడు 'నీకు తల నొప్పి ఎందుకొచ్చిందో నాకు తెలుసు, నాన్నగారూ! నీ తల ఖాళీ కాబట్టి! దాన్ని దేంతోనైనా నింపితే కానీ నొప్పి తగ్గదని ఇందాక నాకు అమ్మ చెప్పింది!" అన్నాడు.

ఆ జోక్ విని అంతా నవ్వారు కానీ, అతను నవ్వలేదు. సీరియస్‌గా, ప్రిన్సెస్ డయానా కారు ఏక్సిడెంట్‌లో పోయిందన్న వార్తలా విని ఊరుకున్నాడు.

మనిషిని నవ్వించే రెండో ఆయుధం అయిన ఓ పిచ్చి కవిత చెప్పాను (ఇది 'చంటబ్బాయ్' నవల్లోదండోయ్!).

కాళ్లకి బాటా
నెత్తికి రాటా
నా కిష్టం సపోట
నీకు నాకు టాటా!

దీక్షితులు భార్య కిసుక్కున నవ్వింది కానీ, అతగాడి మొహంలోని పెదవులు అర్ధ మిల్లీమీటరు కూడా విచ్చుకోలేదు.

ఇక మూడో పద్ధతిలో నవ్వించాలనుకున్నాను. ఓ కాగితం అడిగి తీసుకుని దానిమీద 'ఎలా తెలుసు?' అని రాశాను. తర్వాత ఆ కాగితం మడిచి దీక్షితులుతో చెప్పాను.

"నేను మాట్లాడే వాక్యం పూర్తయ్యాక నువ్వేం మాట్లాడతావో నాకు తెలుసు."

అతను వెంటనే "ఎలా తెలుసు?" అన్నాడు (అతను నాకు నా కాలేజీ రోజుల్లోంచి తెలుసు కాబట్టి అత నేం మాట్లాడతాడో నాకు తెలుసని మీకు తెలుసునుకుంటా!).

వెంటనే నేను కాగితం మడత విప్పి దాన్ని అతనికి చూపించాను కానీ, అందులో నే రాసింది చదివి అతగాడు నవ్వనేలేదు. అదే సీరియస్ మొహం. నేను ఓడిపోతున్నా నని గ్రహించగానే నాలో పట్టుదల పెరిగింది. వెంటనే ఓ మనిషిని నవ్వించే నాలుగో చిట్కాని ప్రయోగించాను.

నా రెండు చూపుడు వేళ్లని నా పెదవులకి చెరో మూల అటూ, ఇటూ ఉంచి, వాటిని బలంగా లాగి నాలికని ఎంత బయటికి వస్తే అంత బయటికి చాపించి, అదే సమయంలో నా కళ్లతో నా ముక్కు టిప్‌ని కొన్ని క్షణాలు చూశాను. ఆ గదంతా వెంటనే నవ్వులతో నిండిపోయింది. బట్, ఆ గదిలో ఒక్క దీక్షితులే నవ్వలేదు. నా మొహం వంక ఇందాక టి.వీ.లో రేలంగి డాన్స్‌ని చూసినట్లుగానే చూశాడు అదే సీరియస్ ఫేస్‌తో.

డామిట్!

ఏమైంది, దీక్షితులు, నీలోని సెన్సాఫ్ హ్యూర్? ఆలోచించి, దీక్షితులు నాన్నని కుర్చీమీద నిలబడమన్నాను. ఆయన అలా నిలబడ్డాక చెప్పాను - "మిమ్మల్ని నవ్వించే ప్రయత్నం చేస్తాను. మీరు నవ్వకుండా ఉండాలి. ఏం? నవ్వితే కుర్చీ దిగిపోవాలి. మీరు ఓ నిమిషంపాటు కుర్చీమీద నవ్వకుండా నిలబడితే మీరు గెలిచి నేను ఓడినట్లు. సరేనా?'

అంగీకారంగా తల ఊపాడు అంతటి పెద్దమనిషీ - కొడుకు కోసం.

ఒకటి రెండు నవ్వొచ్చే జోక్స్ చెప్పాను. రెండు చెవుల్లో రెండు బొటన వేళ్లు ఉంచి, రెండు అరచేతుల్ని పక్షి రెక్కల్లా ఆడిస్తూ, నాలికని బయటికి చాపి అటూ ఇటూ దాన్ని ఆడించాను. వెనక్కి ఒంగుతున్నట్లు నటిస్తూ పడ్డాను. ఆ గదిలోని అంతా నా చర్యలకి నవ్వాపుకోలేకపోయారు - దీక్షితులు తండ్రితో సహా - ఒక్క దీక్షితులు తప్ప.

నిమిషానికి పది క్షణా లుందనగా దీక్షితులు తండ్రి ఓడిపోయి కుర్చీ దిగాడు. నేను దీక్షితులు భార్యవంక చూశాను. ఆమె నా వంక దీనంగా చూస్తోంది. ధైర్యం చెబుతున్నట్లుగా చిరునవ్వు నవ్వి, ఓ మనిషిని నవ్వించే ఇంకో ప్రక్రియ అయిన కొంటె ప్రశ్నలు - కోణంగి జవాబులు రెండు చెప్పాను.

ఇండియాలో బద్ధకస్తులు ఎక్కడ ఉంటారు?

ప్రభుత్వ కార్యాలయాల్లో.

కోడి చేత వేణ్నీళ్లు తాగిస్తే ఏమవుతుంది?

బాయిల్డ్ ఎగ్ పెడుతుంది.

మొదటి ప్రశ్న జవాబుకి సగంమంది, రెండో ప్రశ్న జవాబుకి మిగిలిన వాళ్లు కూడా నవ్వారు కానీ దీక్షితులు నవ్వడే!

నవ్వెప్పుడూ అంటు వ్యాధిలాంటిది. ఒకరు నవ్వితే, ఆ చప్పుడు విని ఇతరులూ నవ్వుతారు. ఈ చిట్కా కనిపెట్టే ఇంగ్లీషు 'సిట్ కాం'లలో (టీ.వీ. సీరియల్స్) కేన్డ్ లాఫ్టర్, అంటే ప్రోగ్రాంలోనే మిక్స్ చేసిన నవ్వులని వినిపిస్తూంటారు. అలాంటిది ఇన్ని నవ్వుల మధ్య దీక్షితులు నవ్వకుండా అలా ఎలా దేభ్య మొహంతో చూడగలుగుతున్నాడు?

ప్రాక్టికల్ జోక్స్ ఎవర్నయినా నవ్వించి తీరాలి. సో, ఓ రూపాయి నాణాన్ని, రెండు రూపాయల నాణాన్ని దీక్షితులు చూసేలా కింద రోడ్డుమీద పర్మ నెంట్ గ్లూతో అతికించాను. క్షణాల్లో అవి అతుక్కుపోయాయి. రోడ్డుమీద వెళ్లేవాళ్లు ఆ నాణాలను చూసి ఆగి, వాటిని ఇతరులు చూడకుండా సంగ్రహించాలని నానా అవస్థలు పడి వెళ్లడం చూస్తే నాకే నవ్వాగలేదు. ఆఖరికి ఓ డబల్ డెక్కర్ డ్రైవర్‌కూడా బస్సాపి దిగి, వాటిని తీసుకోవాలని యత్నించి, రోడ్డుమీంచి ఊడి రాని వాటివంక చిత్ర విచిత్రంగా చూసుకుంటూ వెళ్లడం మా అందరినీ ఘొల్లున నవ్వేలా చేసింది - ఒక్క దీక్షితుల్ని తప్ప. బి.బి.సి.లో డయానా అంతిమయాత్ర పాల్గొన్న దృశ్యం చూస్తున్నట్టుగా చూశాడు.

అంతే!

నా ఒకో ఆయుధం ఫెయిలవుతుంటే

ఏఎన్నార్, ఎస్వీఆర్‌లు మాయాబజార్‌లో యుద్ధం చేస్తూండగా ఓడిపోతున్న ఘటోత్కచుడి పరిస్థితిలా మారింది నా స్థితి. నేచురల్‌గా పట్టుదల పెరిగింది. వెంటనే లేచి నిలబడి నా రెండు కాళ్లు వెనక్కి, ముందుకి ఎంత దూరం వెళ్లగలవో అంత దూరం వేస్తూ నడుస్తూ, నా చేతలని పైకీ కిందకి కదపసాగాను. నా సిల్లీ వాక్ మళ్లీ అందరినీ నవ్వించింది - ఒక్క దీక్షితుల్ని తప్ప.

నాకు పట్టుదల వస్తే మనిషిని కాను కదా! దాంతో జంతువుల గొంతులని అనుకరించాను. బట్ ఇన్ వైన్. రాజ్‌బాబు ఘటోత్కచుడి వేషం వేసుంటే ఎలా నటించేవాడో అభినయించి చూపాను. లాభం లేకపోయింది. ఏకవీరలో కాంతారావు డైలాగ్స్‌ని మిమిక్రీ చేశాను. బట్ ఇన్ వైన్.

దీక్షితులుకి, నాకు కామన్ ఫ్రెండ్ అయిన చౌదరి నడకని, మాట తీరుని, మానరిజాన్ని అనుకరిస్తూ దీక్షితులుతో మాట్లాడాను. మళ్లీ ఇంకా ఇన్‌వెయిన్ అయింది.

చెప్పాగా పట్టుదల వస్తే నేను మనిషిని కానని. నా నాలికని నా కింది పళ్లకింద ఆనించి ఉంచి 'నేను, విఠల్ కలిసి టర్కికీ ట్యూస్‌డేనాడు టమోటాలు ఈటింగ్ కోసం ట్రైన్‌లో ఫస్ట్ క్లాసు డబ్బాలో నైటంతా ట్రావెల్ చేసి వెళ్లాం!' అన్న డైలాగ్ చెప్పాను. అంతా పగలబడి నవ్వారు - మళ్లీ ఒక్క దీక్షితులు దక్క!

హతవిధీ!!

ఓటమి నా మాట కాదు కానీ, ఈసారి నా నాలికని మడిచి అంగిటికి ఆనించి మళ్లీ పై డైలాగ్‌ని మాట్లాడాను. పక్కింటి పనిమనిషితో సహా అంతా నవ్వారండీ! - ఒక్క దీక్షితులు దక్క.

మాజిక్, మాజిక్ షోలు కూడా హాస్యం కోసం చూస్తూంటారు. ఓ టోపీని నా నెత్తిమీద ఉంచుకుని చెప్పాను దీక్షితులు తల్లితో - "మీ పనిమనిషికి విజయదశమికి మీరు చీర పెట్టాలి కదా! దాని బదులు కోడి ఇస్తే సరి పోతుందంటే, ఓ కోడిని నా టోపీ కింద నుంచి తీసిస్తాను!"

"సరే!" ఉత్సాహంగా చెప్పిం దావిడ.

దీక్షితులుతో సహా అంతా నా వంక ఆసక్తిగా చూశారు.

"అబ్రకదబ్ర!" మూడుసార్లు అని, టోపీ తీసి అందులోనుంచి ఓ కోడి ఈకని తీసి ఆవిడ కిచ్చి చెప్పాను. "సారీ! కోడి అదృశ్యం అయిపోయింది. పోనీ ఇంకోసారి ట్రై చెయ్యనా?"

"చెయ్యి, బాబూ!"

మళ్లీ ఇందాకటి రొటీన్‌ని చేసి టోపీ తీశాను. అందులోంచి కోడి గుడ్డు తీసిచ్చి చెప్పాను - "ఈసారి గుడ్డుని పెట్టి మరీ కోడి అదృశ్యం అయింది. ఇంకోసారి దాన్ని ఎవరి చేతయినా పొదిగించితే విజయదశమినాటికి కోడి ఖాయం!"

నేను చెప్పకుండానే ఈపాటికి మీకు విషయం అర్థం అయిపోయింది. దీక్షితులు నవ్వలేదు. మిగిలినవాళ్లంతా ఘొల్లున నవ్వారు.

నవ్వబట్టి ఆ ఫ్లాట్‌లోని అందరి మొహాల్లో నేను వచ్చినప్పుడు ఉన్న దైన్యం, దిగులు మాయం అయ్యాయి. అందరికీ చెప్పాను -"నా ఆఖరి ప్రయత్నం చేస్తాను. ఈసారి దీక్షితులుగాడు నవ్వకపోతే నాకు ఇక ఇంతేసంగతులు!"

దీక్షితులు భార్య చీర, బ్లౌజ్ వేసుకుని, నుదుట తిలకం దిద్దుకుని, గాజులు వేసుకుని అతని దగ్గరికి కాఫీ కప్పుతో వెళ్లి, దాన్ని అందించి చెప్పాను ఆడ గొంతుతో - "ఏమండీ! కాఫీ. చక్కెర సరిపోకపోతే చెప్పండేం! అంతే కానీ కొట్టకండి!"

దీక్షితులు భార్యతో సహా అంతా పకపకా నవ్వారు - ఎక్సెప్ట్ దీక్షితులు. ఎక్సెప్ట్ ఓన్లీ దీక్షితులు.

ఇంటికి వెళ్తూ ఎంత ఆలోచించినా నాకు అర్థం కాలేదు; ఓ మనిషిని నవ్వించడానికి మనిషి ఇంతలాగా కనిపెట్టిన ఏ ప్రక్రియా కూడా దీక్షితుల్ని ఎందుకు నవ్వించలేదో బోధపడలేదు.

* * *

చాలా కాలం తర్వాత అర్ధరాత్రి దీక్షితు లింటి నుంచి ఫోన్ వచ్చింది. వా ళ్లావిడ మహదానంద పడిపోతూ అడిగింది - "వినపడుతోందా?"

"మీ వాయిస్సా? చక్కగా, లైన్ ఫాల్ట్ లేదు.'

"అది కాదండీ! మా వారి నవ్వు!"

"ఏమిటీ? దీక్షితులు నవ్వుతున్నాడా?" ఆశ్చర్యంతో కూడిన ఆనందంతో అడిగాను.

"అవును. ఇప్పుడే టి.వి. కట్టేసి హాయిగా నవ్వుతున్నారు."

"అలాగా? టి.వీ.లో ఈరోజు ఆఖరి ప్రోగ్రాం ఏమొచ్చింది? నేను చూడలేదు." అడిగాను ఆవలించి.

"రేపటి ప్రసారాలు."

"దాంట్లో నవ్వొచ్చే దేముంటుంది?" అడిగాను అర్థం కాక.

"ఆయనే చెప్తారు."

దీక్షితులు లైన్‌లోకి వచ్చి ఆనందంగా నవ్వుతూ చెప్పాడు. "అమ్మయ్య !ఇక రేపటినుంచి ..." నవ్వు వల్ల ఆ వాక్యం పూర్తి చేయలేకపోయా డతను.

"... రేపటి నుంచి? కాస్త నాకు చెప్పి నవ్వరా!' ' అర్థించాను.

"... పటి నుంచి ఫిల్మ్ బేస్డ్ ప్రోగ్రామ్‌లు రావు. ఇకమీదట చిన్న తెరమీద అన్ని కార్యక్రమాల్లో సినిమావాళ్ల మొహాలు అహ్హహ్హా ... కనబడవంటే కనబడవు... అహ్హహ్హహ్హా ..." నవ్వుతూనే ఉన్నాడు.

ఇంతకాలం దీక్షితులు ఏడుపుకి కారణం కనుక్కోలేక పోయినందుకు చింతించాను. అలాగే చాలామంది ఏడుపుకి కూడా!

(నాకు తెలుసు ఇవాళ తేదీ, నెల, సంవత్సరం ఏమిటని మీరు ఆసక్తిగా, ఆనందంగా న న్నడుగుతారని. ఆ నవ్వుల పండగ రోజు వచ్చే సెంచరీలోది తప్ప, ఈ సెంచరీకి సంబంధించినది కాదని మాత్రమే నేను చెప్పగలను.)

